క్లుప్తంగా

సీపీఎం జిల్లా కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్

భీమవరం: మెంటేవారితోట సీపీఎం జిల్లా కార్యాలయంలో జేఏవీ గోపాల్ అధ్యక్షతన పార్టీ పశ్చిమగోదావరి జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు మంతెన సీతారాం హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు ఏడాదికి 200 రోజులు కల్పించాలన్నారు. రైతులకు ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించి, విత్తనాల కొరత లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో సెక్రటేరియట్ సభ్యులు చింతకాయల బాబూరావు, కేతా గోపాలన్ డి.కళ్యాణి, కె.నాగేశ్వరరావు, పి.వి.ప్రతాప్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

తణుకు టౌన్: గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితుల మెరుగుదలకు 20 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీవో డీ శ్రీలలిత గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం సాయంత్రం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో గ్రామాల్లో చేపట్టాల్సిన వివిధ పనులు గురించి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామీణ మంచినీటి సరఫరా ఏఈ మహ్మద్ బుస్రా మాట్లాడుతూ గ్రామాల్లోని రక్షిత మంచినీటి ట్యాంక్‌లను ప్రతీ 15 రోజులకు ఒక సారి శుభ్రం చేయాలని కోరారు. అలాగే మంచినీటి పైప్‌ల లీకేజీలు లేకుండా చూడాలన్నారు. మంచినీటి పైప్‌ల వద్ద చెత్త, చెదారాలు లేకుండా పంచాయతీ సిబ్బంది పర్యవేక్షించాలని కోరారు. ఈవోపీఆర్‌డీ కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న పన్నులను వెంటనే వసూలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేత

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా తణుకు ఎస్టీ కాలేజీలో ఐటీలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినికి రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. గురువారం అసోసియేషన్ కార్యాలయంలో దాతలు అక్కిన బాపినీడు, చెరుకూరి శ్రీనివాస్‌లు రూ. 15 వేలను విద్యార్థినికి ఫీజుల నిమిత్తం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నల్లజర్ల వెంకటేశ్వరరావు, అక్కిన బాపినీడు, ఎస్ రామకృష్ణారావు, ఎండీ స్వాలిహా, సాంబశివరావు తదతరులు పాల్గొన్నారు.

42 మందికి వృద్ధులకు వైద్య పరీక్షలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం 42 మందికి ఉచితంగా సుగర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. గురువారం తణుకు బ్యాంక్ కాలనీలో గల అసోసియేషన్ కార్యాలయంలో డాక్టర్ మోగంటిరాజేష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పెనుమర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా

తాడేపల్లిగూడెం (టీఓసీ): జాతీయ లోక్ అదాలత్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తాడేపల్లిగూడెం 11వ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ షేక్ సికిందర్ బాషా పేర్కొన్నారు. కోర్టులో గురువారం న్యాయవాదులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సికిందర్ బాషా మాట్లాడుతూ రాజీ పడదగ్గ అన్ని కేసులైన క్రిమినల్, సివిల్, మోటారు వాహన ప్రమాద బీమా కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు, బ్యాంక్ తదితర కేసులు రాజీ చేయాలని, న్యాయవాదులు సహకరించాలని తెలిపారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యకిరణ్ శ్రీ, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి.అరుంధతి, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఇ.అన్నామణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయకుమార్ పాల్గొన్నారు.

కే లంక ఛానల్ సమస్యపై కలెక్టర్‌కు నివేదిస్తాం



కే లంక ఛానల్ పంట కాలువను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు



కే లంక ఛానల్ పంటకాలువలోకి వస్తున్న చెరువు నీరు

జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

కాళ్ల: మండల కేంద్రమైన కాళ్ల గ్రామంలో ఉన్న కే లంక ఛానల్ పంట కాలవను జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పరిశీలించారు. గ్రామంలో సార్వా నారుమళ్లు వేసుకోవడానికి నీరు లేక కాలువల ద్వారా వచ్చే నీరు ఉప్పు నీరు కావడంతో కాళ్ల రైతులు ఈ నెల 18న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలిశారు. ఆయన దీనిపై స్పందించి విచారణ చేయవలసిందిగా ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ బీవీవీ నాగేశ్వరరావును నియమించారు. దీనిపై ఆయన గురువారం కాళ్ల పంచాయతీ కార్యాలయం వద్ద రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. రైతులకు ఉన్న సమస్యలను అడిగి తెలుసుకొని అనంతరం రైతులతో కలిసి కేలంక ఛానల్‌ను పరిశీలించారు. ఈఈ బీవీవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ కాళ్ల రైతులు జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన ఆదేశాలతో కే లంక ఛానల్ పరిశీలించి రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. రైతులు తెలిపిన సమస్యలను క్షేత్రస్థాయిలో చూసిన పరిస్థితిని నివేదిక రూపంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సమర్పించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా రొయ్యల చెరువుల కలుషిత నీరు పంట కాలువల్లోకి వదిలేయడం , ఉప్పు నీరు బోర్లు కాలువకు ఇరువైపులా ఉండడం దీనివల్ల ఉప్పు నీరు కలవడంతో తాగునీరు కలుషితం అవుతుందోనని దీనిపై తగు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. అదే విధంగా అధికారులతో కలిసి మరలా గురువారం జిల్లా కలెక్టర్‌ను కలిసినట్లు రైతులు తెలిపారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ ఇరిగేషన్ అధికారులకు వారం రోజుల్లోగా సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు శ్రీనివాస్ పంచాయతీ సెక్రెటరీ సతీష్ రైతులు గ్రామ పెద్దలు ఉన్నారు.

ఘనంగా ఏపీ బహుజన జేఏసీ ఆవిర్భావ దినోత్సవం

భీమవరం: ఏపీ బహుజన జేఏసీ ఆవిర్భావ దినోత్సవాన్ని భీమవరం పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. జేఏసీ గౌరవ అధ్యక్షుడు కాటం స్టాన్లీరాజు, ఫౌండర్ కన్వీనర్ తాళ్లూరి మధు, రాష్ట్ర అధ్యక్షుడు కోనా జోసఫ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం కోసం పోరాటాలు చేస్తున్నామన్నారు. అంబేద్కర్ విగ్రహాల వద్ద ప్రభుత్వం సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గుల్లంకి కుమార్, ఈది రవి, బిరుదుగడ్డ మహేష్‌బాబు, దుండి అశోక్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

తణుకులో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం

తణుకు: పట్టణంలో గురువారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. గత కొద్దిరోజులుగా ఎండ వేడిమి కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలకు వర్షం ఉపశమనం కలిగించింది. గురువారం ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మరోవైపు బ్యాంకు కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, ఎన్జీవో కాలనీ, వీధులు జలమయమయ్యాయి.

కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ అండ

పార్టీ శ్రేణులకు తెలిపిన పీవీఎల్



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు పీవీఎల్ నరసింహరాజు

కాళ్ల: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని మాజీ డీసీసీబీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు పీవీఎల్ నరసింహరాజు పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. కాళ్ల మండలం పెదఅమిరం పార్టీ కార్యాలయంలో గురువారం ఉండి, పాలకోడేరు మండలాల పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పేదవాడికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. నియోజవర్గంలో కార్యకర్తలు, నాయకులు కుటుంబ సభ్యులుగా ఉండి పార్టీ కోసం పని చేశామన్నారు. నియోజవర్గంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పదవీ కాలంలో ప్రజల కోసం పని చేయాలని కోరారు. ఏ ఇబ్బంది వచ్చినా ప్రతీ కార్యకర్తకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తానని చెప్పారని ఆయన స్పష్టం చేశారు. గతంలో మన ప్రభుత్వంలో ఎవరినీ ఇబ్బంది పెట్టలేదని గుర్తు చేశారు. ప్రజలందరికీ మేలే చేశామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పెనుమత్స ఆంజనేయరాజు, పాలకోడేరు ఎంపీపీ భూపతిరాజు చంటిరాజు, గుండు నాగేశ్వరరావు, గులిపల్లి అచ్చారావు, ధనుంజయ్, బడుగు బాలాజీ, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యోగులు నిబద్ధతతో పని చేయాలి

ఘనంగా రెవెన్యూ దినోత్సవం



తహసీల్దార్ కార్యాలయంలో రిటైర్డ్ మున్సబ్ శ్రీరామమూర్తిని సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: ఉద్యోగులు నిబద్ధతతో ప్రజలకు మంచి సేవలందించినప్పుడే ఉద్యోగులంటే గౌరవం ఉంటుందని డిప్యూటీ తహసీల్దార్ జీఎన్‌వీ పవన్ కుమార్ అన్నారు. భీమవరంలో తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ డే సందర్భంగా రిటైర్డ్ మున్సబ్ గ్రంధి శ్రీరామమూర్తిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. రెవెన్యూ డిపార్ట్‌మెంట్ ప్రాముఖ్యతను విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఆదిమూర్తి నాయుడు, మండల సర్వేయర్ శివ, మెహర్ జ్యోతి, వీఆర్‌వోలు రత్నంరాజు, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

కాళ్లలో.. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీదేవి మాట్లాడుతూ ప్రజలు వచ్చిన వెంటనే వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని తెలిపారు. ఆయా గ్రామాల్లో వీఆర్వోలు, వీఆర్‌ఏలు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మీ కిరణ్, అధికారులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం



ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: నియోజకవర్గంలోని డ్రెయిన్లు, కాలువలు గుర్రపు డెక్క, తూడు చెత్తలతో నిండిపోయాయని, వెంటనే తొలగించాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులకు సూచించారు. భీమవరంలో ఇరిగేషన్ ఈఈ దక్షిణామూర్తి, డ్రైనేజీ ఈఈ ఎంవీవీ కిషోర్, తదితర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ మిషన్ లేదా మ్యాన్యువల్ పద్ధతిలో పనులు చేసుకోవాలని, ఇలా చేస్తే ఈ క్రాప్‌కు ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. కార్యక్రమంలో కోళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ

వీరవాసరం: విద్య ద్వారానే సమాజం వృద్ధి చెందుతుందని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) తెలిపారు. వీరవాసరం మద్దాల రామకృష్ణమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన మండల స్థాయి స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు పుస్తకాలు, స్కూల్ బ్యాగులు, యూనిఫామ్ లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరవల్లి దుర్గ భవాని, జెడ్పీటీసీ గుండా జై ప్రకాష్ నాయుడు, మండల విద్యాశాఖ అధికారి శివన్నారాయణ, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, కోళ్ల నాగేశ్వరరావు, వీరవల్లి చంద్రశేఖర్, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

'పది' ప్రతిభావంతులకు బహుమతులు



విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: విద్యార్థులు దాతలు అందించిన సహకారాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రధానోపాధ్యాయులు ఇళ్ల రాంబాబు అన్నారు. మండలంలోని దిరుసుమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024–25లో పదిలో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించిన పూర్ణ చంద్రిక (569)కి రూ.6 వేలు, ద్వితీయ స్థానం సాధించిన వి.అనిత గ్లోరీ (523) కి రూ.5 వేలు, తృతీయ స్థానం సాధించిన పి.రాజేశ్వరి (494)కి రూ.4 వేల నగదును, మెమెంటోలను అందించారు. 1979 పదోతరగతి పూర్వ విద్యార్థుల సహకారంతో ప్రోత్సాహక నగదు అందించారు. కార్యక్రమంలో అల్లూరి యుగంధర్ రాజు, ఆకుల త్రిమూర్తులు, పెన్మెత్స నారాయణరాజు, అజయ్‌కుమార్, కలిదిండి నాని, మైగాపుల గంగారామ్, ఇర్రింకి భవాని, ఎద్దు కాంతామణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు సులభతరంగా రెవెన్యూ సేవలు



అత్తిలి రెవెన్యూ డే సందర్భంగా వీఆర్‌ఏలను సన్మానిస్తున్న తహసీల్దార్ తాతారావు



తణుకులో విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులను సత్కరిస్తున్న దృశ్యం

అత్తిలి: రెవెన్యూ సేవలను ప్రజలకు సులభతరంగా అందించడానికి రెవెన్యూ సిబ్బంది కృషి చేయాలని, ప్రజలలో రెవెన్యూ శాఖపై ఉన్న అపోహలు తొలగించుకోవాలని తహసీల్దార్ తాతారవు తెలిపారు. గురువారం అత్తిలి తహసీల్దార్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం రాక ముందు ఈస్ట్ ఇండియా పాలకులు 1786 జూన్ 20న రెవెన్యూ బోర్డు ఏర్పాటు చేసారని, దీంతో ప్రతి ఏడాది జూన్ 20న రెవెన్యూ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఈసందర్భంగా రిటైర్డు తహసీల్దార్ పోతురాజు, పాలూరు వీఆర్‌ఏగా పనిచేస్తున్న అడపా బుల్లబ్బాయి, మంచిలి వీఆర్‌ఏ సుబ్బారావును రెవెన్యూశాఖ తరపున సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శాంతకుమారి, వీఆర్వోలు అప్పాజీ, యాకోబు, భూషణం, తదితరులు పాల్గొన్నారు.

తణుకులో ఘనంగా రెవెన్యూ దినోత్సవం

తణుకు టౌన్: ప్రజలకు, సమాజానికి సేవలందించడంలో రెవిన్యూ శాఖకు శతాబ్దాల చరిత్ర ఉందని తణుకు డిప్యూటీ తహసీల్దార్ కోనా ఉదయ్ భాస్కర్ చెప్పారు. గురువారం తణుకు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ స్థాయిలలో పదవీ విరమణ చేసిన రెవిన్యూ ఉద్యోగులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్‌లు బీ సూర్యనారాయణరాజు, కె. కాశీ కృష్ణ, ఆర్ఐ భవానీ, రాష్ట్ర గ్రేడ్ 2 రెవిన్యూ అధికారుల అసోసియేషన్ అధ్యక్షుడు నిమ్మలపూడి సుధాకర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కారుమంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

తణుకు: కారుమంచి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు మేనేజర్ కారుమంచి యోహాన్ జన్మదినం పురస్కరించుకుని తణుకులో గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తణుకు శివారు మురికివాడల్లో పేదలకు ఆహారం అందజేసిన యోహాన్ అనంతరం బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కారుమంచి శామ్యూల్, పుట్టా సాయి. రామ్‌చరణ్, బెన్ను, కొల్లి చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత యోగా ధ్యాన శిక్షణ

భీమవరం: స్థానిక డీఎన్నార్ కళాశాల రామకృష్ణ సభా భవనంలో ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సహజ యోగ ట్రస్ట్ ఆధ్వర్యంలో యోగా ధ్యాన శిక్షణ ఉచితంగా నేర్పిస్తామని నిర్వాహకులు తెలిపారు. సహజ యోగ జిల్లా కోఆర్డినేటర్ సీహెచ్ మణి మాట్లాడుతూ ధ్యానం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. యోగా, ధ్యాన శిక్షణలో పాల్గొనేందుకు 98493 79979 నెంబర్ నందు సంప్రదించాలని కోరారు.

పరీక్షల నిర్వహణలో ఎన్టీఏ విఫలం

భీమవరం: జాతీయ పరీక్షల నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) విఫలమయ్యిందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.ఈశ్వర్, టీ.ప్రసాద్ తెలిపారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ యొక్క బాధ్యతారాహిత్యాన్ని ఖండిస్తున్నామన్నారు. ఎన్టీఏ ప్రారంభం నుంచి మొత్తం విద్యా వ్యవస్థను అపహాస్యం చేస్తోందని విమర్శించారు. పరీక్షల నిర్వహణలో ఎన్టీఏ పూర్తిగా విఫలమయ్యిందనడానికి నీట్ పేపర్ లీక్, సీయూఈటీ పరీక్షలో వ్యత్యాసాలు, యూజీసీ నెట్ పరీక్ష రద్దు దీనికి నిదర్శనమన్నారు. పరీక్షల నిర్వహణ బాధ్యతల నుంచి ఎన్టీఏను తొలగించాలని, పటిష్టమైన పరీక్ష నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

23న మానవత సమావేశం

పెంటపాడు : ఈనెల 23న ఉదయం 10 గంటలకు పెంటపాడు ప్రభుత్వ పోస్టుబేసిక్ పాఠశాలలో మానవత మండల సమావేశం నిర్వహించనున్నట్లు మండల మానవత సంస్థ అధ్యక్షుడు నల్లమిల్లి ప్రభాకరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సంస్థ ఉమ్మడి జిల్లా చైర్మన్ తాడేపల్లి మోహనరావు, మండల విద్యాశాఖాధికారి టీవీ రామకృష్ణ, కార్యవర్గ సభ్యులు హాజరవుతారన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ



అయిభీమవరంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థి కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆకివీడు: క్రమ శిక్షణతో కూడిన విద్య ఉన్నత స్థితికి చేరుస్తుందని మాజీ ఎంపీ కనుమూరు బాపిరాజు అన్నారు. అయిభీమవరం గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎల్లప్పుడూ సత్యాన్ని పలికితేనే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం సర్పంచ్ గాలి సామ్రాజ్యం మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సన్నిధి వెంకటేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ నౌకట్ల రామారావు, మాజీ ఉపసర్పంచ్ కనుమూరు రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న ఉచిత విద్యా సామాగ్రితో విద్యార్థులు ఉత్తమ ఫలితాల్ని సాధించాలని 2వ వార్డు కౌన్సిలర్ గోపిశెట్టి సత్యవతి పిలుపునిచ్చారు. అజ్జమూరు గరువు ప్రాంతంలోని ఎంపీపీ స్కూల్‌లో విద్యా కిట్లను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆర్‌వీ.నారాయణ(విక్రమ్), సత్యనారాయణ, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ శైలజ, వైస్‌చైర్మన్ ధనలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో వర్క్‌షాప్



ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వర్క్ షాప్‌లో మాట్లాడుతున్న ఎస్.భాస్కర్

భీమవరం: విద్యార్థులు సాధించిన విజయాలే అధ్యాపకులకు, సంస్థకు పేరు తెస్తాయని తమిళనాడుకు చెందిన త్యాగరాజర్ ఇంజనీరింగ్ కళాశాల ఆర్‌అండ్‌డీ డీన్ ఎస్.భాస్కర్ అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎఫెక్టివ్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ అవుట్ కం బేస్డ్ ఎడ్యుకేషన్ అనే అంశంపై మూడు రోజుల వర్క్ షాప్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. కార్యక్రమానికి ఐక్యూఏసీ డీన్ ఎస్.రాజేష్ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. అవుట్ కం బేస్డ్ విద్యా విధానములో జాతీయ స్థాయిలో సుదీర్ఘ అనుభవం కలిగిన భాస్కర్ మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాలలో దాదాపు మూడు దశాబ్దాల క్రితమే ఔట్ కం బేస్డ్ విద్యా విధానంతో ఉత్తమ ఫలితాలు సాధించారని ఆయన వెల్లడించారు. భారతదేశంలో ఏటా 1.5 మిలియన్ ఇంజనీరింగ్ విద్యార్థులు బయటకు వస్తున్నా వారిలో 10 శాతం మించి ఉద్యోగాలు లేదా ఉపాధి పొందలేకపోతున్నారన్నారు. దీనిని అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చిందని పేర్కొన్నారు. అధ్యాపకులు ఎప్పటికప్పుడు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ మురళీకృష్ణంరాజు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో లీగల్ మెట్రాలజీ అధికారుల దాడులు

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడులో లీగల్‌మెట్రాలజీ అధికారులు గురువారం దాడులు చేశారు. ఈ సందర్భంగా స్థానిక సూర్య దాల్ కంపెనీలో తనిఖీలు నిర్వహించారు. సరుకును, రిజిష్టర్‌ను పరిశీలించారు. ఈ దాడిలో తూకంలో తేడా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. లీగల్‌మెట్రాలజీ ప్రకారం సరుకుపై ఎ1 కేసులు నమోదు చేసి సరుకును సీజ్ చేశారు. ఈ దాడుల్లో మెట్రాలజీ అధికారి అప్పలనాయుడు, పెంటపాడు తహసిల్దార్ సురేష్‌బాబు, గూడెం, పెంటపాడు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

సోడదాసు సునీత W/o సామ్యూల్ డోర్.నెం.6-171, పెదఅమీరం, కాళ్ళ మండలం, ప.గో.జిల్లా, అను నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా యొక్క పాస్‌పోర్ట్ నెం.R7191839 నెంబరు గల ఒరిజినల్ పాస్‌పోర్ట్ మా ఇంటి వద్ద నుండి జిరాక్స్ నిమిత్తం పెదఅమిరం సెంటర్‌కి వెళ్ళగా మార్గమధ్యలో పడిపోయినది. దొరికిన వారు దయచేసి పై అడ్రసు నందు సంప్రదించగలరు.

ఇట్లు, సోడదాసు సునీత

ఘనంగా వరాల వెంకన్న శేషవాహన సేవ

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీవరాల వెంకటేశ్వరస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి స్వామివారి శేషవాహన సేవ ఘనంగా జరిగింది. ఉదయం మేడపాటి ఈశ్వరరెడ్డి, సూర్యభవాని దంపతులచే స్వామివారికి సుప్రభాతసేవ, మేలుకొలుపు, తోమాల సేవ నిర్వహించారు. రాత్రి పెన్మెత్స రామాంజనేయరాజు, సుబ్బమ్మ దంపతులచే స్వామివారి శేషవాహన సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. విశేషంగా అలంకరించిన శేషవాహనంపై శ్రీస్వామి, అమ్మవార్లను ఉంచి మేళతాళాలు, గోవింద నామస్మరణల నడుమ గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఈకార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల వెంకట నారాయణరావు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెంచండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పెంటపాడు, తాడేపల్లిగూడెం మండల్లాలోని ప్రాథమిక కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, హెల్త్ ప్రొవైడర్లు, ఆరోగ్య కార్యకర్తలకు క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వేపై మూడు రోజుల పాటు 18, 19, 20 తేదీలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు ఆదేశాలు మేరకు నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.పద్మ అధ్యక్షతన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రజలకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించి తద్వారా వ్యాధి సంక్రమణ వద్ద వారిని గుర్తించాలని, తగు జాగ్రత్తలు తీసుకోవడం తదితర అంశాలపై ప్రజలకు చెప్పాలన్నారు.